# సాక్షి
## కృష్ణాజిల్లా


మంగళవారం । 22 । ఏప్రిల్ । 2025






### ఈవీఎం గోడౌన్ తనిఖీ

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సోమవారం కలెక్టరేట్ ప్రాంగణం లోని ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేశారు. అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.



### సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 514.70 అడుగుల వద్ద ఉంది. ఇది 139.7888 టీఎంసీలకు సమానం.



### నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రిపై నిత్యాన్నదానానికి కృష్ణాజిల్లా కేసరపల్లికి చెందిన జి.నీలిమ కుటుంబం సోమవారం రూ.1,04,893 విరాళాన్ని అందించింది.

-8లో▸

## న్యూస్‌రీల్

### దేశంలో రాజ్యాంగానికి ముప్పు



పెనమలూరు: దేశంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో రాజ్యాంగానికి ముప్పు వాటిల్లే పరిస్థితి నెలకొందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. పోరంకి విజ్ఞాన భారత్ పాఠశాలలో సోమవారం అబ్దుల్ కలాం స్టడీ సర్కిల్ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వాహకుడు అమరయ్య శాస్త్రి అధ్యక్షతన భారత రాజ్యాంగం నేడు ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కొలీజియం కమిటీ దాదాపు 60 దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి అనేక మతాలకు, జాతులకు, కులాలకు దేశ సమైక్యత విధానాలకు అనుగుణంగా రాజ్యాంగాన్ని రచించారన్నారు. అయితే దేశంలో నేటి రాజకీయ పరిస్థితుల కారణంగా రాజ్యాంగానికి తూట్లు పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయ వ్యవస్థ సైతం నాయకుల చేతిలో సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు. అబ్దుల్ కలాం స్టడీ సర్కిల్ విజ్ఞాన వేదిక నిర్వాహకుడు అమరయ్య శాస్త్రి మాట్లాడుతూ ప్రతి నెలా ఇటువంటి సదస్సులు ఏర్పాటు చేస్తామని, దీనికి అందరి మద్దతు కావాలని కోరారు. కార్యక్రమంలో విజ్ఞాన్ భారత్ పాఠశాల కరస్పాండెంట్ ప్రొఫెసర్ కొడాలి రామశేషాద్రిరావు, మండల సీఐటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి, మండల సీపీఎం కార్యదర్శి షేక్.కాశిం, నేతలు షేక్ మస్తాన్, పి.పాతాళలక్ష్మి,పి.లక్ష్మీనారాయణ, సోమశేఖర్, ప్రజా సంఘాల నేతలు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రతి కార్డుదారుడికి ఈ-కేవైసీ తప్పనిసరి

జేసీ గీతాంజలిశర్మ

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని పొందేందుకు రేషన్‌కార్డులోని ప్రతి ఒక్క సభ్యుడు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ తెలిపారు. సోమవారం నాటికి జిల్లాలో 71,110 మంది సభ్యులు ఇంకా ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. ఈ లబ్ధిదారుల వివరాలు రేషన్ షాపు డీలరు వద్ద, పౌర సరఫరాల డెప్యూటీ తహసీల్దార్ వద్ద, పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ మొబైల్ షాపులో గ్రామ రెవెన్యూ అధికారి, డిజిటల్ అసిస్టెంట్ లాగిన్ ద్వారా అందుబాటులో ఉన్న ఈ-పోస్ పరికరాల ద్వారా గాని ఈ-కేవైసీని పూర్తి చేసుకోవచ్చునన్నారు.

### ముగ్గురు రైల్వే ఉద్యోగులకు జీఎం సేఫ్టీ అవార్డులు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైళ్ల నిర్వహణలో లోపాలను గుర్తించి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించిన విజయవాడ డివిజన్‌కు చెందిన ముగ్గురు ఉద్యోగులు 'జీఎం మ్యాన్ ఆఫ్ ద మంత్ సేఫ్టీ అవార్డును అందుకున్నారు. సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం నుంచి విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్‌తో పాటుగా సికింద్రాబాద్, హైదరాబాద్, గుంటూరు, గుంతకల్లు, నాందేడ్ డివిజన్‌ల డీఆర్ఎంలతో వర్చువల్ పద్ధతిలో భద్రతపై దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రయాణికుల సురక్షిత ప్రయాణం, భద్రతలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించిన దెందులూరు ఆపరేటింగ్ విభాగంలోని స్టేషన్ సూపరింటెండెంట్ టి.వి.ఎం.యూ మహేశ్వర్, రాజమండ్రి ఆపరేటింగ్ విభాగంలోని పాయింట్ మెన్ కె.నథానియేల్, రాజమండ్రిలోని ట్రైన్ మేనేజర్ లోకేష్‌కుమార్‌లకు జీఎం అరుణ్‌కుమార్ జైన్ చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ ఉద్యోగులను ప్రత్యేకంగా అభినందించారు.

### 'స్వచ్ఛ చల్లపల్లి'కి చిత్తూరు జిల్లా మహిళా సర్పంచులు

చల్లపల్లి: చిత్తూరు జిల్లాకు చెందిన 25 మంది మహిళా సర్పంచులు స్వచ్ఛ సుందర చల్లపల్లి పరిసరాలను, కార్యక్రమాలను వీక్షించడానికి సోమవారం విచ్చేశారు. స్వచ్ఛ చల్లపల్లికి కృషి చేస్తున్న రథసారథులు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, పద్మావతి, స్వచ్ఛ కార్యకర్తల కృషిని అభినందించారు. అనంతరం స్వచ్ఛ కార్యక్రమాలను డీఆర్కే ప్రసాద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో వారికి వివరించారు.

# కనీస సౌకర్యాలు కరువు

- పట్టణాల్లో పెరుగుతున్న అస్సెస్‌మెంట్లు
- పన్నుల వసూళ్లలో మాత్రం వెనుకంజ
- పారిశుద్ధ్యం, డ్రైనేజీ, తాగునీటి వసతుల కల్పనలో అశ్రద్ధ
- 2024–25లో మచిలీపట్నం కార్పొరేషన్‌లో 52,570కి చేరిన ఆస్తి పన్నులు
- గుడివాడలో 29,384...పెడనలో 7578కు చేరిన అస్సెస్‌మెంట్లు

కృష్ణాజిల్లాలోని నగర పంచాయతీలు, పట్టణాలు, నగరాల్లో ఏ ఏడాదికాయేడు అస్సెస్‌మెంట్లు పెరుగుతున్నాయి. అయితే పెరుగుతున్న అస్సెస్‌మెంట్ల స్థాయిలో పన్నుల వసూళ్లు ఉండడం లేదు. తత్ఫలితంగా పురజనులు కనీస మౌలిక సౌకర్యాలకు కూడా నోచుకోవడం లేదు.



పెడన: కృష్ణా జిల్లాలోని నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఆస్తిపన్ను కట్టించుకునే అస్సెస్‌మెంట్లు పెరుగుతున్నా మౌలిక వసతుల కల్పనలో ఆయా పురపాలక సంఘాలు, కార్పొరేషన్లు వెనుకంజ వేస్తున్నాయి. ఆదాయ మార్గాలు అన్వేషించకుండానే ఆస్తి పన్నుల రూపంలో ఆదాయానికి ఆస్కారం ఏర్పడుతోంది. అయితే ఆస్తి పన్నులు వసూలు చేయడంలోనే అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రైవేటు ఆస్తి పన్నుల జోలికి పోకుండా అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తున్నారనే ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి. మరో పక్క అస్సెస్‌మెంట్ల సంఖ్య నగరాలలోను, పట్టణాల్లోనూ ప్రతి సంవత్సరం వేలల్లో పెరుగుతోంది. చిన్న మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో మాత్రం ఈ సంఖ్య వందల్లోనే పెరుగుతోంది.

**ఆదాయాన్ని బట్టి అభివృద్ధికి నిధులు కేటాయింపా?**

ఒక పక్క కార్పొరేషన్లలోను, మున్సిపాలిటీల్లోను, నగర పంచాయతీలలో అస్సెస్‌మెంట్ల ద్వారా ఆదాయం పెరుగుతూ వస్తోంది. అయితే వసూళ్లు చేయడంలో బాగా వెనుకబడుతున్నారనే విమర్శలున్నాయి. కచ్చితంగా వసూలు చేస్తే మౌలిక వసతులు కూడా కల్పించడానికి వీలవుతుందనే వాదన కొందరి నుంచి వ్యక్తమవుతోంది. పూర్తి స్థాయిలో వసూళ్లు చేయకపోవడం వల్ల పెండింగ్ పడుతూ వస్తుండటంతో మౌలిక వసతులకు ఈ నిధులు కేటాయించలేక పోతున్నారనే వాదన కూడా వినిపిస్తోంది. ఆదాయాన్ని బట్టి అభివృద్ధికి నిధులు కేటాయింపు అంటే కొన్ని పురపాలక సంఘాలు, మున్సిపాలిటీలు ఇప్పుడిప్పుడే అభివృద్ధి సాధించలేవనే వాదన కూడా వ్యక్తమవుతోంది. ఆదాయాన్ని బట్టి కాకుండా అన్ని పట్టణాలు, నగరాలను సమాన దృష్టితో చూసి అభివృద్ధి చేయాలని పురప్రజలు కోరుతున్నారు.

**కృష్ణాజిల్లాలో గత రెండేళ్లుగా పెరిగిన అస్సెస్‌మెంట్లు**

| కార్పొరేషన్/మున్సిపాలిటీ | 2023–24 | 2024–25 | పెరిగినది |
|---|---|---|---|
| మచిలీపట్నం | 48,272 | 52,570 | 4,298 |
| గుడివాడ | 26,258 | 29,384 | 3,126 |
| తాడిగడప | 44,671 | 48,006 | 3,335 |
| ఉయ్యూరు | 9,911 | 10,119 | 208 |
| పెడన | 7,234 | 7,578 | 344 |

**మౌలిక వసతుల విషయం ప్రభుత్వమే చూసుకోవాలి**



ఆస్తి పన్నుల ద్వారా అస్సెస్‌మెంట్లు పెరిగి ఆదాయం పెరుగుతున్నా అందుకు తగ్గ వ్యయం మాత్రం రెట్టింపుగా ఉంటోంది. సిబ్బంది జీతాలతో పాటు విద్యుత్ బిల్లులు, సచివాలయాల అద్దెలు వంటి వాటికే మున్సిపల్ జనరల్ ఫండ్స్ నిధులు సరిపోతున్నాయి. ఇక మౌలిక వసతుల విషయం ప్రభుత్వమే చూసుకోవాలి.

– పి.వెంకటేశ్వరరావు, ఆర్ఐ, పెడన

**మౌలిక వసతులు మృగ్యం**

ఉయ్యూరు నగర పంచాయతీలో ప్రాపర్టీ ట్యాక్స్ 2024–25 ఏడాదిలో 10,119కి చేరింది. కాని తాగునీటి వసతి పూర్తి స్థాయిలో కల్పించలేకపోతున్నారు. పెడన పురపాలక సంఘంలో ఆస్తి పన్నులు కట్టించుకునే అస్సెస్‌మెంట్లు పెరుగుతున్నా పారిశుద్ధ్య సిబ్బంది అందుకు తగ్గ విధంగా లేరు. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేదు. కనీస మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



కారుణ్య నియామక పత్రాలు పొందిన వారితో జిల్లా కలెక్టర్ బాలాజీ, ఇతర అధికారులు

**కలెక్టర్ డీకే బాలాజీ**

చిలకలపూడి(మచిలీపట్నం):అంకితభావంతో విధులు నిర్వర్తించాలని కొత్తగా నియామక పత్రాలు అందుకున్న ఉద్యోగులకు కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం మీకోసం సమావేశ మందిరంలో రెవెన్యూ శాఖకు చెందిన 12 మందికి కారుణ్య నియామక పత్రాలను కలెక్టర్ అందజేశారు. వారిలో 8 మంది జూనియర్ అసిస్టెంట్లు కాగా, ఒకరు సచివాలయ కార్యదర్శి, ముగ్గురు ఆఫీస్ సబార్డినేట్లు ఉన్నారు. అందులో టి.మణి, సీహెచ్ గోపాలకష్ణ, ఎస్.అజయ్ బాబు, డి.కిరణ్ కుమార్, ఎ.భరత్ కుమార్, ఎం.చైతన్యకుమార్, వై.అహల్య, సీహెచ్ భవానీశంకర్ జూనియర్ అసిస్టెంట్లుగా, వినోద్ కుమార్ సచివాలయ కార్యదర్శిగా, పి.సుజాత, యు.వెంకటరావులను ఆఫీస్ సబార్డినేట్లుగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో డీఆర్ఓ కె. చంద్రశేఖరరావు, కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీ శ్రీదేవి, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, డ్వామా డీఆర్ డీఏ పీడీలు శివప్రసాద్, హరిహరనాథ్, డీఎస్ఓ పార్వతి, డీఎంహెచ్ఓ డాక్టర్ శర్మిష్ట, పౌరసరఫరాల సంస్థ డీఎం సీహెచ్ పద్మావతి, ఆర్ అండ్ బీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈలు లోకేష్, నటరాజ్, గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి వెంకట్రావు, డీపీఓ అరుణ, సీపీఓ గణేష్, జిల్లా వ్యవసాయ అధికారి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# దేశభక్తికి ప్రతీక ఎన్‌సీసీ

**ఎస్పీ ఆర్.గంగాధరరావు**

కోనేరుసెంటర్: విలువలతో కూడిన క్రమశిక్షణకు, దేశభక్తికి ఎన్‌సీసీ ప్రతీక అని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. స్థానిక చిలకలపూడి నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎన్‌సీసీ క్యాడెట్లకు క్యాంప్ కిట్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను కూడా విద్యార్థి దశలో ఎన్‌సీసీ క్యాడెట్‌గా చేశానని చెబుతూ అప్పటి అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ఎన్‌సీసీ ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించి విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. ఎన్‌సీసీ శిక్షణలో తీసుకున్న రైఫిల్ ట్రైనింగ్ ఉద్యోగం వచ్చాక పోలీసు శిక్షణలో ఎంతో ఉపయోగపడిందని చెప్పారు. జిల్లా విద్యా శాఖాధికారి రామారావు మాట్లాడుతూ ఎన్‌సీసీ ద్వారా చక్కని శారీరక దారుఢ్యంతో పాటు ఆత్మస్థైర్యం, సమయస్ఫూర్తి అలవడతాయన్నారు.



ఎన్‌సీసీ క్యాడెట్‌లకు కిట్‌లను అందజేస్తున్న ఎస్పీ గంగాధరరావు, చిత్రంలో డీఈఓ రామారావు

అనంతరం ఎన్‌సీసీ విద్యార్థులకు క్యాంప్ కిట్లు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ సలహాదారుడు డీవీఆర్, పాఠశాల ఎన్‌సీసీ ఆఫీసర్ అప్పినేడి వెంకట రామాంజనేయులు(రాము), ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాఠశాలను మా ఊరి నుంచి తరలించొద్దు సారూ!

**కలెక్టర్‌కు బ్రహ్మానందపురం వాసుల వేడుకోలు**

వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): మండలంలోని వక్కపట్లవారిపాలెం శివారు బ్రహ్మానందపురం పాఠశాలను గ్రామానికి దూరంగా తరలించవద్దని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వేడుకున్నారు. మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తమ ఇబ్బందులను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా పంచాయతీ పరిధిలో రెండు కిలోమీటర్ల దూరంలోని వక్కపట్లవారిపాలెం పాఠశాలలో విలీనం చేసే ప్రక్రియ చేపట్టారని ఇది ఎట్టి పరిస్థితుల్లోనూ సహేతుకం కాదని వాపోయారు. బ్రహ్మానందపురంలో నివసించే వారంతా షెడ్యూల్ కులానికి చెందినవారని, ఇక్కడి పాఠశాలలో 45 మంది విద్యార్థులు 1 నుంచి 5వ తరగతి వరకు చదువుకుంటున్న చిన్న పిల్లలని, వీరంతా రెండు కిలోమీటర్ల దూరం ఎలా నడిచి వెళ్తారని ప్రశ్నించారు.



బందరు కలెక్టర్ కార్యాలయంలో బ్రహ్మానందపురం విద్యార్థుల తల్లిదండ్రులు

మార్గ మధ్యంలో అవనిగడ్డ–నాగాయలంక, భావదేవరపల్లి ప్రధాన రహదారులు ఉన్నాయని ఈ రహదారులు ఎప్పుడూ వాహనాల రాకపోకలతో రద్దీతో ఉంటాయని, చిన్నపిల్లలు ఆ రోడ్ల వెంట ఎలా వెళ్లగలరని ప్రశ్నించారు. విద్యాశాఖ ఉద్యోగుల సౌలభ్యం కోసం పాఠశాలను తరలించే ప్రయత్నం విరమించకపోతే ప్రత్యక్ష కార్యాచరణతో నిరసన కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుందని 30 మందికి పైగా గ్రామస్తులు బందరు వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

# గుట్టచప్పుడు కాకుండా..

**జగ్గవరపుగుట్టను మాయం చేస్తున్న మైనింగ్ మాఫియా**



రెడ్డిగూడెం జగ్గవరపుగుట్టపై అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న దృశ్యం



రెడ్డిగూడెం చెరువులోని మట్టిని తవ్వుతున్న దృశ్యం

మైలవరం: రెడ్డిగూడెం మండలంలో అనుమతులు లేకుండా మట్టి, గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా మండల కేంద్రం రెడ్డిగూడెం, రంగాపురం, కూనపురాజుపర్వ గ్రామ సర్వే పరిధిలోని జగ్గవరపుగుట్టపై మైనింగ్ మాఫియా కన్ను పడింది. జగ్గవరపుగుట్టను తవ్వి కూనపురాజు పర్వ గ్రామానికి తరలిస్తున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ కార్యాలయాల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే ఈ గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పొక్లయినర్‌తో గుట్టను తవ్వి ట్రాక్టర్‌ల ద్వారా తరలిస్తుండగా సోమవారం అటువైపు వస్తున్న పాత్రికేయులను చూసి పలాయనం చిత్తగించారు. ఈ గ్రామాల్లో గత రెండు, మూడు రోజులుగా రాత్రి, పగలు కూడా యథేచ్ఛగా ట్రాక్టర్‌లతో సాగుతున్న మట్టి తరలింపుల కారణంగా వస్తున్న దుమ్ముతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**చెరువునూ చెరపట్టారు..**

రెడ్డిగూడెం గ్రామ పంచాయతీకి చెందిన కొత్త చెరువు నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రెవెన్యూ, పోలీస్ స్టేషన్‌కు అతి సమీపం నుంచి అక్రమ మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్‌లు వెళుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ట్రాక్టర్ మట్టిని రూ.1500కు అమ్ముకుని మాఫియా సొమ్ము చేసుకుంటోంది. గృహ అవసరాల నిమిత్తం సాకుతో వ్యాపారం జోరుగా సాగుతోంది. ఈ అక్రమ మట్టి తవ్వకాలు, తరలింపునకు సంబంధించి కూటమి నేతలతో సహా ఎవరి వాటా వారికి అందుతుండటంతో వారు పట్టించుకోవడం లేదని విమర్శలు స్థానికుల నుంచి వినవస్తున్నాయి. మట్టి తవ్వకం మాఫియాకు అధికార పార్టీకి చెందిన మండల స్థాయి ప్రజా ప్రజాప్రతినిధి అండ ఉండటంతోనే ఈ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన పొక్లయినర్ యజమాని తన ఇష్టం వచ్చినట్లుగా రెడ్డిగూడెంలోని కొత్త చెరువు నుంచి ఈ తవ్వకాలు జరుపుతున్నా అధికారుల నుంచి స్పందన లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. రెవెన్యూ, పోలీస్ శాఖ తమది బాధ్యత కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. మండలంలోని నాగులూరు, వెలగలగూడెంలోని చెరువుల్లో కూడా తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నట్లు తెలిసింది. అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ వహించండి

- అధికారులకు కలెక్టర్ బాలాజీ ఆదేశం
- మీకోసంలో 201 అర్జీలు స్వీకరణ



మీకోసం కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఇతర అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రజల నుంచి వచ్చే అర్జీల విషయంలో అత్యంత శ్రద్ధ వహించి సానుకూలంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు డీఆర్వో చంద్రశేఖరరావు, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, మెప్మా పీడీ సాయిబాబు, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, పౌరసరఫరాల సంస్థ డీఎం పద్మాదేవి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పోషణ్ అభియాన్ ఏడో పౌష్టికాహార పక్షోత్సవం జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. గర్భస్థ దశ నుంచి రెండు సంవత్సరాల వరకు పౌష్టికాహారం అందజేసేందుకు లక్ష్యంగా ఈ పక్షోత్సవాలు నిర్వహించాలన్నారు. పిల్లల్లో పౌష్టికాహార లోపం నివారించాలని, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. మీకోసంలో 201 అర్జీలను స్వీకరించారు.

**ప్రధానంగా వచ్చిన అర్జీలు ఇవే...**

- పమిడిముక్కల మండలం లంకపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు సీహెచ్ రాజ్‌సురేష్ లంకపల్లి గ్రామంలో గత 60 సంవత్సరాలుగా తన స్వాధీనంలోనే ఉన్న సర్వే నంబర్ 188/5 లో ఉన్న 60 సెంట్ల భూమిని తన వదిన పది మందితో కలిసి వచ్చి ఆక్రమించుకున్నారని, తనకు పోలీస్ రక్షణ కల్పించి తన భూమిని కాపాడాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



దివ్యాంగురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

- కోడూరు మండలం సాలెంపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు కొప్పనాతి అనూహ్య తన తల్లి విజయ సాయంతో మీకోసం కార్యక్రమానికి వచ్చారు. తనకు ప్రస్తుతం రూ.6 వేలు పింఛను వస్తోందని, పూర్తిగా మంచానికే పరిమితమైన తనకు రూ.15 వేలు పింఛను మంజూరు చేయాలని కోరుతూ అర్జీ ఇచ్చారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా చికిత్స చేయించమని వైద్యాధికారులను ఆదేశించారు.
- ముదినేపల్లి మండలం వైవాక గ్రామానికి చెందిన ఎం.వీర వెంకట సుబ్రహ్మణ్యం ఉయ్యూరు మండలం కలువపాములలోని జ్యోతి పాలిటెక్నిక్‌లో తన కుమార్తె చేర్పించానని, అయితే ప్రభుత్వం వారు అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా ఇచ్చే ఫీజు జమ కాలేదన్నారు. రోజు కూలీ చేసుకుని జీవనం సాగించే తాను కుమార్తె ఫీజు విషయంలో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నందున న్యాయం చేయాలని కోరుతూ అర్జీ ఇచ్చారు.

### దుర్గమ్మ హుండీ ఆదాయం రూ. 3.02 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా రూ. 3.02 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడుల రూపంలో సమర్పించారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం మహామండపం ఆరో అంతస్తులో లెక్కించారు. 18 రోజులకుగాను రూ. 3,02,92,986 నగదు, 440 గ్రాముల బంగారం, 5.225 కిలోల వెండి లభ్యమైనట్లు ఆలయ ఈవో కె.రామచంద్రమోహన్ తెలిపారు. కానుకల లెక్కింపును ఈవో పర్యవేక్షించగా, ఆలయ ఏఈవోలు, సూపరిండెంటెంట్లు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### 'అప్పులు సాకుగా చూపి పథకాలు ఎగ్గొట్టేందుకు కుట్ర'



ధర్నా చేస్తున్న సీపీఐ న్యూ డెమోక్రసీ నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అప్పులు సాకుగా చూపి సూపర్ సిక్స్ పథకాలు ఎగ్గొట్టేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్ అన్నారు. సంపద సృష్టించి సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారం చేపట్టి 11 నెలలు కావొస్తున్నా ఏ ఒక్క పథకం అమలు చేయలేదన్నారు. విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలని కోరుతూ సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వస్తే నవరత్నాలకు మించిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ప్రజలను నమ్మించి టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. సూపర్ సిక్స్ హామీలతో పాటు ఇతర వర్గాలకు 176 అడ్డగోలు హామీలిచ్చిందన్నారు. అప్పుల పేరుతో ఈ పథకాల ఎగవేతకు పథకం పన్నడం ప్రజాద్రోహమని విమర్శించారు.

**క్విడ్ ప్రోకోగా..**

రైతులకు ఇచ్చిన హామీల్ని వదిలి భారీ భూభాగాల్ని క్విడ్ ప్రోకోగా కంపెనీలకు కట్టబెడుతున్నారని గుర్తు చేశారు. ప్రజలు ఏమీ చేయరని చంద్రబాబు భావిస్తే.. ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజు దూరంలోనే లేదని ప్రసాద్ హెచ్చరించారు. పార్టీ నగర కార్యదర్శి పి.పద్మ, ఇఫ్టూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మునిశంకర్, దాది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### వంశీ బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

**విజయవాడ(గన్నవరం):** సత్యవర్ధన్ కేసులో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విజయవాడలోని ఏసీబీ కోర్టులో సోమవారం వాదనలు ముగిశాయి. తొలుత ఈ కేసు విచారణ ప్రారంభంకాగానే పోలీసుల తరఫున జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ రాజేంద్రప్రసాద్ వాదనలు వినిపించారు. కేసులో విచారణ ఇంకా పూర్తి కాలేదని, నిందితుల్లో సగం మందిని అరెస్ట్ చేయాల్సి ఉందని కోర్టుకు తెలిపారు. ఈ సమయంలో బెయిల్ ఇస్తే విచారణకు ఆటంకం ఏర్పడుతుందని వాదించారు. అయితే వంశీమోహన్ తరఫు న్యాయవాది దేవి సత్యశ్రీ బెయిల్ కోరుతూ గట్టిగా వాదనలు వినిపించారు. సత్యవర్ధన్ భద్రత కారణాలతో మొదటిసారి బెయిల్ రద్దు చేశారని, ప్రస్తుతం సత్యవర్ధన్‌కు పూర్తిస్థాయిలో పోలీస్ భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. అతని ఇంటి వద్ద 24/7 సెక్యూరిటీ నిఘా సీసీ కెమెరాలు, పోలీస్ చెక్ పోస్ట్, పోలీస్ పెట్రోలింగ్ ఉన్నట్లుగా కోర్టుకు వివరించారు. ప్రస్తుతం సత్యవర్ధన్‌కు ఎటువంటి ప్రాణహాని లేదన్నారు. ఈ కేసులో విచారణ కూడా పూర్తికావడంతో పోలీసులు ఇప్పటికే 161, 164 స్టేట్‌మెంట్లు కోర్టుకు సమర్పించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. ఈ పరిస్థితుల్లో వంశీమోహన్‌కు బెయిల్ మంజూరు చేయాలని సత్యశ్రీ కోర్టుకు విన్నవించారు. ఇరువైపులా వాదనలు విన్న జడ్జి భాస్కరరావు తీర్పును ఈ నెల 24కు రిజర్వ్ చేశారు.

### వక్ఫ్ బోర్డును కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలి

**కొండపల్లి(ఇబ్రహీంపట్నం):** ముస్లిం సమాజానికి ఉపయోగపడని వక్ఫ్ బోర్డును రద్దు చేయాలని, వక్ఫ్ బోర్డు చట్టాన్ని మార్చాల్సిన అవసరం లేదని ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అల్తాఫ్ రాజా కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. కొండపల్లిలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. వందల ఏళ్ల నుంచి వస్తున్న మా పూర్వీకుల భూములను 1958లో బలవంతంగా సర్వే చేసి 1962లో గెజిట్‌లో చేర్చారన్నారు. మత పెద్దలు, ఉన్నతాధికారులతో ముస్లిం ఆస్తులు కాపాడేందుకు వక్ఫ్ బోర్డు ఏర్పడిందన్నారు. నేడు రాజకీయ నాయకులు జోక్యంతో వక్ఫ్ బోర్డు భ్రష్టుపట్టి ముస్లింలకు ఉపయోగపడని విధంగా మార్చారన్నారు.

# కోర్టు కేసుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కలెక్టర్ డీకే బాలాజీ



మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, పక్కన అధికారులు

**చిలకలపూడి(మచిలీపట్నం):** కోర్టు కేసులకు సంబంధించి వకాలత్ లేదా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులను ఉపేక్షించేది లేదని, వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ హెచ్చరించారు. నగరంలోని కలెక్టరేట్ మీ కోసం సమావేశ మందిరంలో మీ కోసం కార్యక్రమానికి ముందుగా కలెక్టర్ జిల్లా అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించి, వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోర్టు కేసులకు సంబంధించి ఎప్పటికప్పుడు స్పందించి వకాలత్‌లు లేదా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలన్నారు. కోర్టు కేసులంటే చాలా మంది అధికారులు సర్వ సాధారణంగా తీసుకుంటున్నారని, కేసు రేపు వాయిదా ఉండగా ముందు రోజు స్పందిస్తున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు. ముందుగా తెలిసినప్పటికీ దానికి తగ్గ ఏర్పాట్లు చేసుకోకుండా చివరి నిమిషం వరకు ఆగి తన వద్దకు రావడం సరికాదని హితవు పలికారు. ఎవరైనా జిల్లా అధికారి కోర్టు ధిక్కరణకు సంబంధించి నిర్లక్ష్యం వహించి కలెక్టర్‌గా తాను హాజరయ్యే పరిస్థితి తీసుకొస్తే ఉపేక్షించేది లేదని, చివరిసారిగా మరోసారి హెచ్చరిస్తున్నారన్నారు.

**పీ 4 ఆదర్శ కుటుంబం వాట్సాప్ గ్రూప్..**

ప్రతి ఒక్క కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఈహెచ్‌ఎస్(ఉద్యోగుల ఆరోగ్య పథకం) కింద కార్డులు జారీ అయ్యేలా సంబంధిత జిల్లా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ బాలాజీ చెప్పారు. ఇందుకు సంబంధించి త్వరలో ఒక రోజు సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామన్నారు. అలాగే ఈహెచ్‌ఎస్‌లో ఉద్యోగుల పేర్లు నమోదు చేసేందుకు అన్ని విధాలా ప్రయత్నం చేసి వెంటనే నివేదికను అందజేయాలని సూచించారు. గతేడాది నూతన ప్రభుత్వం సాధించిన ప్రగతి, విజయాలపై ఒక పుస్తకం రూపొందిస్తున్నామని అందుకు సంబంధించిన గణాంక వివరాలు, ఫొటోలు, ప్రజల అభిప్రాయాలతో నివేదికను వెంటనే అందజేయాలన్నారు. నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు మిగిలిన అధికారులతో ఒక బృందంగా ఏర్పడి పీ 4 మార్గదర్శి ఆదర్శ కుటుంబం కార్యక్రమం కింద వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇటీవల ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన పేద విద్యార్థులకు ఆర్థిక భరోసా కల్పించి వారు ఉన్నత చదువులు చదువుకోవడానికి ధనికులతో అనుసంధానం చేసి అవసరమైన కోచింగ్ వసతి కల్పించేందుకు కృషి చేయాలన్నారు.

**24న డీఆర్సీ సమావేశం..**

ఈ నెల 24వ తేదీన జిల్లా సమీక్షా సమావేశం(డీఆర్సీ) జిల్లా ఇన్‌చార్జి మంత్రివర్యుల అధ్యక్షతన జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. ప్రగతి నివేదికలు ఇవ్వని అధికారులు వెంటనే నివేదికలు అందజేయాలని సూచించారు. మీ కోసం అర్జీల పరిష్కారంలో జిల్లా అట్టడుగు స్థాయిలో ఉండటం విచారకరమన్నారు. ఇకనైనా సకాలంలో అర్జీలన్నీ పరిష్కరించి జిల్లాను అగ్రస్థానంలో నిలపాలన్నారు. అర్జీదారులతో మర్యాదగా మాట్లాడాలని ఈ విషయమై కిందిస్థాయి అధికారులు సిబ్బంది వరకు సమాచారం చేరవేయాలని సూచించారు. గడువు మీరిన అర్జీలు ఇంకా 28 ఉన్నాయని అత్యధికంగా పోలీస్ శాఖలో అపరిష్కృతంగా ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కార్యాలయాల నుంచి వచ్చిన అర్జీలకు కలెక్టరే సంతకం చేసి పంపిస్తేనే అది పరిష్కరించినట్లు అవుతుందని ఈ విషయం ప్రతి అధికారి గుర్తుంచుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, కేఆర్‌ఆర్‌సీ ఎస్డీసీ శ్రీదేవి, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డ్వామా డీఆర్డీఏ పీడీలు శివప్రసాద్, హరిహరనాథ్, డీఎస్ఓ పార్వతి, డీఎంహెచ్ఓ శర్మిష్ట, పౌర సరఫరాల సంస్థ డీఎం పద్మావతి, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈలు లోకేశ్, నటరాజు, గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి వెంకట్రావు, డీపీఓ అరుణ, సీపీఓ గణేషు, జిల్లా వ్యవసాయ అధికారి మనోహర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## దుర్గమ్మకు పలువురు భక్తుల విరాళాలు

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి కృష్ణాజిల్లా కేసరపల్లికి చెందిన భక్తులు సోమవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. కేసరపల్లికి చెందిన బి.నీలిమ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,04,893ల విరాళాన్ని అందించారు.


దాతకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారి

**నిత్యాన్నదానం, బంగారు తాపడం పనులకు..**

విజయవాడకు చెందిన భక్తులు నిత్యాన్నదానానికి, బంగారు తాపడం పనులకు వేర్వేరుగా విరాళాలను అందజేశారు. విజయవాడ మాచవరానికి చెందిన అట్లూరి రామ్మోహన్‌రావు, సువర్ణ దంపతులు నిత్యాన్నదానానికి రూ.లక్ష, బంగారు తాపడం పనులకు రూ.లక్ష విరాళాన్ని అందించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

## మహిళా పోలీసుల ఆరోగ్య రక్షణకు వైద్య శిబిరాలు

**పెనమలూరు:** మహిళా పోలీసుల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తామని విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు అన్నారు. కానూరు టాప్‌స్టార్ ఆస్పత్రిలో సోమవారం క్యాన్సర్‌పై అవగాహన, మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. మహిళా పోలీసులు పని ఒత్తిడిలో ఉండి ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేసే అవకాశం ఉంటుందన్నారు. మహిళా పోలీసులు ఆరోగ్యంగా ఉంటేనే విధుల నిర్వహణ సక్రమంగా జరుగుతుందని, వారి కుటుంబాలు కూడా సంతోషంగా ఉంటాయని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని క్యాన్సర్‌పై అవగాహన, ఉచిత వైద్య పరీక్షల శిబిరం ఏర్పాటు చేశామన్నారు. క్యాన్సర్ వ్యాధిని తొలి దశలోనే గుర్తిస్తే సులభంగా జయించవచ్చన్నారు. ఎన్టీఆర్ జిల్లా సురక్ష ఫౌండేషన్ కన్వీనర్ కేవీ నరసమయ్య మాట్లాడుతూ.. మహిళా పోలీసులతో పాటు ఇతర సిబ్బంది ఆరోగ్య భద్రతకు మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ.. సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్‌ను తాను డొనేట్ చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీపీ సరిత, టాప్‌స్టార్ ఎండీ తాతినేని శ్రీనివాస్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.


కానూరులో మాట్లాడుతున్న సీపీ రాజశేఖరబాబు

## మూడు చక్రాల వాహనాల పంపిణీ

**చిలకలపూడి(మచిలీపట్నం):** సమాజంలో ఇతరుల మాదిరిగానే విభిన్న ప్రతిభావంతులు గర్వంగా బతకాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో పాఠశాల విద్య – సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కలెక్టర్ బాలాజీ దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లను సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు ఆరోగ్య శిబిరాలను నిర్వహించి వారికి ఏ అవసరాలు ఉన్నాయో గుర్తించామన్నారు. ఆ మేరకు జిల్లాలో 132 మందికి 212 బ్యాటరీ మూడు చక్రాల వాహనాలు, చక్రాల కుర్చీలు, మూడు చక్రాల సైకిళ్లు, నడక కర్రలు తదితర రూ.15,63,218 విలువైన పరికరాలు కేంద్ర ప్రభుత్వం తరఫున అలింకో సంస్థ సహకారంతో అందజేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని విభిన్న ప్రతిభావంతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా లబ్ధిపొందిన దివ్యాంగులు తమకు మూడు చక్రాల వాహనాలు అందించినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అధికారి డీటీడబ్ల్యూ ఫణి ధూర్జటి, దివ్యాంగుల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు అందజేస్తున్న కలెక్టర్ బాలాజీ, అధికారులు

### ఇంటర్‌లో ప్రవేశాలకు హెచ్‌ఎంలు సహకరించాలి




**మచిలీపట్నంటౌన్:** ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని విద్యార్థుల ప్రవేశాలకు ప్రధానోపాధ్యాయులు సహకరించాలని ఇంటర్మీడియెట్ జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి, ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి సాల్మన్ రాజు కోరారు. స్థానిక లేడీ యాంప్థిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం మచిలీపట్నం అర్బన్, రూరల్ ప్రధానోపాధ్యాయుల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లో నైపుణ్యం కలిగిన విద్య బోధనా, అర్హత కలిగిన అధ్యాపకులు ఉండడంతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులందరికీ ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, రికార్డులు, బ్యాగ్‌లు మధ్యాహ్నం ఉచితంగా భోజన సదుపాయాలను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంసెట్ మెటీరియల్‌ను ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుందరలక్ష్మి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

### జనరల్ బోగీలు నాటికకు ప్రథమ బహుమతి



**గుడివాడటౌన్:** కృష్ణా ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ గుడివాడ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి నాటక పోటీల్లో జనరల్ బోగీలు నాటిక ఉత్తమ ప్రదర్శనగా నిలిచి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానం ఇది అతని సంతకం, తృతీయ స్థానం నాన్నా నేనొచ్చేస్తా, ప్రత్యేక జ్యూరీ ప్రదర్శనగా చిగురు మేఘం ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. మొత్తం 8 నాటికలు ఈ పోటీల్లో పాల్గొన్నాయన్నారు. నాటికలో పాల్గొన్న ప్రతి బృందానికి రూ.20 వేలు పారితోషికం, యువ కళాకారులకు 15 మందికి రూ.1,000 చొప్పున అందజేశామన్నారు. వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, జ్యూరీ బహుమతి రూ.4 వేలు, ఇతర బహుమతులకు ఎంపికైన ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## పొలాల్లో మతి స్థిమితం లేని వ్యక్తి మృతి

**పెదన:** పంట పొలాలకు వెళ్లే డొంకరోడ్డులో ఒక వ్యక్తి చనిపోయి పడి ఉంటాన్ని స్థానికులు గమనించి సోమవారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని ఉప్పలకలువగుంట గ్రామానికి చెందిన చిట్టూరి రామకృష్ణ(60) ఒంటరిగా జీవిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు. తమను పట్టించుకోవడం లేదని భర్తను వదిలి తన ఇద్దరు పిల్లలతో భార్య కంకిపాడు సమీపంలోని నెప్పల్లికి పదేళ్ల కిందట వెళ్లిపోయింది. అప్పటి నుంచి గ్రామంలో రామకృష్ణ ఒంటరిగా జీవిస్తూ ఎవరైనా పెట్టింది తింటూ తిరుగుతూ ఉండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 18న గ్రామంలో కనిపించిన రామకృష్ణ ఆ తరువాత కనిపించ లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. నందిగామ పంచాయతీ బొడ్డువాని పాలెం డొంకరోడ్డులో పంట పొలాలు వద్ద వడ దెబ్బతో పడిపోవడంతో ఎవరూ గమనించలేదు. సోమవారం ఉదయం అటుగా వెళ్లే రైతులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు వాట్సాప్ గ్రూపుల్లో మృతుడి ఫొటోను పెట్టారు. గుర్తు పట్టిన గ్రామస్తులు రామకృష్ణ భార్య లక్ష్మికి సమాచారం ఇవ్వడంతో ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెడన ఎస్ఐ జి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం రామకృష్ణ మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.


రామకృష్ణ మృతదేహం

## అనుమానాస్పద స్థితిలో ఆటో డ్రైవర్..

**చిట్టినగర్(విజయవాడపశ్చిమ):** ఆటో డ్రైవర్ అనుమానాస్పద రీతిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబాపురంలో చోటు చేసుకుంది. ఘటనపై మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంబాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని నాల్గో లైన్‌లో సాయి వీరేంద్ర కుటుంబం నివాసం ఉంటోంది. వీరేంద్రకు భార్య, ఒక బాబు, పాప సంతానం. ఈ నెల 17న వీరేంద్ర భార్య పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. 19న వీరేంద్ర భార్య వద్దకు వెళ్లి ఇంటి తాళం తెచ్చుకున్నాడు. ఆదివారం వీరేంద్ర ఇంటి లోపల నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన ఇంటి యజమాని తలుపులు పగలగొట్టి చూడగా, ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయాన్ని ప్రకాష్‌నగర్‌లో ఉంటున్న అతడి తల్లి పైడి శైలజకు చెప్పగా ఆమె ఘటనా స్థలానికి చేరుకుంది. ఘటనపై కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన బైక్.. యువకుడి దుర్మరణం

మరో వ్యక్తికి తీవ్ర గాయాలు


రాకేష్ మృతదేహం

**గుడివాడరూరల్:** ఆగి ఉన్న లారీని మోటారు బైకు ఢీ కొనడంతో ఓ యువకుడు దుర్మరణం చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని మల్లాయపాలెంలో చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం చౌటపల్లి గ్రామానికి చెందిన తాడంకి రాకేష్(19) గ్రామానికి చెందిన అతని స్నేహితుడు వరుణ్‌తేజ్‌తో కలిసి చర్చిలో ఈస్టర్ ప్రార్థనల్లో పాల్గొన్నాడు. సోమవారం తెల్లవారు జామున 3.30 గంటల సమయంలో ఇంటికి వెళ్తుండగా మల్లాయపాలెం సమీపంలోని శ్యామలాంబ రైస్‌మిల్లు సమీపంలోకి రాగానే బైక్ అదుపు తప్పి రోడ్డుపై నిర్లక్ష్యంగా నిలిపి ఉంచిన లారీని వెనుక నుంచి ఢీకొన్నారు. దీంతో వారికి తీవ్ర గాయాలు కాగా పలువురు ప్రయాణికులు వెంటనే గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. రాకేష్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తీవ్ర గాయాలకు గురైన వరుణ్‌తేజ్‌ను ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవల నిమిత్తం విజయవాడ తరలించారు. మృతుడి తల్లి రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం అనంతరం రాకేష్ మృతదేహాన్ని అతడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ప్రమాదంతో చౌటపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. చర్చిలో ప్రార్థనకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరగడం బాధాకరమని మృతుడు రాకేష్ స్నేహితులు కన్నీటిపర్యంతమయ్యారు. చిన్న వయసులోనే రాకేష్ మృతి చెందడం పట్ల స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

**పెనమలూరు:** తాడిగడప గ్రామంలో వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప గ్రామం మహాగణపతినగర్‌కు చెందిన ఉత్తరపల్లి రాజేశ్వరి, భర్త శంకరరావు(36) ఇద్దరు కుమారులతో నివాసం ఉంటున్నారు. రాజేశ్వరి రెస్టారెంట్‌లో పని చేస్తుండగా భర్త శంకరరావు విద్యుత్ పనులు చేస్తారు. వీరు ఇటీవల ఇల్లు నిర్మించుకున్న సమయంలో రూ.20 లక్షలు అప్పు చేశారు. అప్పుల భారం అధికం కావటంతో శంకరరావు ఆందోళన చెందుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం భార్య డ్యూటీకి వెళ్లిన సమయంలో శంకరరావు బెడ్ రూమ్‌లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్నాడు. రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


వ్యక్తి మృతదేహం

**గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం):** గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు రోడ్డులోని సిమెంట్ వర్క్స్ కంపెనీ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి వయసు 35 ఏళ్ల లోపు ఉంటాయని, ఎత్తు 5.4 అడుగులు, బ్లూ కలర్ ప్యాంటు, రెడ్ కలర్ బన్నీ, మెడలో తాయత్తు కలిగి ఉన్నాడన్నారు. ఆచూకీ తెలిసిన వారు 94406 27084, 90591 21109, 0866-2882333 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సెక్టార్ ఎస్ఐ విజయలక్ష్మి తెలిపారు.

## బైక్ ఢీ కొని వ్యక్తి మృతి

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** బైక్ యూ టర్న్ తీసుకుంటుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన సూరాయపాలెం వద్ద జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సూరాయపాలేనికి చెందిన తంగెళ్లమూడి శ్రీనివాసరవికుమార్(51) గొల్లపూడిలోని హోల్‌సేల్ మార్కెట్‌లో ముఠా పని చేస్తుంటాడు. సోమవారం ఉదయం చేపలు తేవడానికి ద్విచక్ర వాహనంపై తుమ్మలపాలెం వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తూ ముత్తవరపు వెంకటేశ్వరరావు గెస్టుహౌస్ వద్ద యూ టర్న్ తీసుకుంటుండగా వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీ కొట్టింది. దీంతో శ్రీనివాసరవికుమార్‌కు తలకు గాయమైంది. స్థానికులు అతనిని గొల్లపూడిలోని ఆంధ్రా హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి భార్య ఆదిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.